## క్లుప్తంగా

### పక్షవాత బాధితుడికి పింఛన్ అందజేత



పోతుల రాజాకు పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ పోతుల స్వరూప్

దెందులూరు: సాధారణ పింఛన్లతో పాటు దీర్ఘ కాలిక వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లు మంజూరు చేయడం గొప్ప విషయమని పోతునూరు సర్పంచ్ పోతుల స్వరూప్ అన్నారు. పోతునూరులో మంగళవారం సొసైటీ చైర్మన్ డీఎస్‌వీ ప్రసాద్ బజ్జీ, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, వైసీపీ నాయకులు రమేష్, బుద్దా అర్జున, బీశెట్టి నూకరాజు, పింఛన్ నగదును అందజేశారు. పింఛన్ నగదుతో మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచించారు.

### రహదారి నిర్మాణ పనుల పరిశీలన

దెందులూరు: ప్రతి గ్రామంలోని రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రాధాన్యతనిస్తున్నారని వైసీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఎమ్మెల్యే మంజూరు చేసిన రూ.90 లక్షల నిధులతో శానిగూడెం నుంచి 7వ మైలు వరకూ రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. శానిగూడెం సర్పంచ్ సనిపల్లి రామకృష్ణ విష్ణు పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఫ్రాన్సిస్, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, ముసునూరి వెంకటేశ్వరరావు, చల్లగుళ్ల తేజ, వార్డు మెంబర్ శ్రీధర్, రాజేష్ తదితరులు మంగళవారం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు.

### పైప్‌లైన్ నిర్మాణం ప్రారంభం



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న దెందులూరు సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు

దెందులూరు: అలుగులగూడెంలో పైప్‌లైన్ నిర్మాణ పనులను మంగళవారం వైఎస్సార్ సీపీ నేత స్థానిక వార్డు మెంబర్ కాండ్రు ప్రసన్న రాణి, దెందులూరు సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు వీధుల్లో డ్రెయినేజీలతోపాటు, పైప్‌లైన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి నిధులు మంజూరు చేశారని తెలిపారు. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉందని పార్టీ నాయకులు కొమ్ముల రవి, స్థానిక నాయకులు అన్నారు.

### వెలుగు వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): వెలుగు వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వీరికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం బాధాకరమన్నారు. వేతనాలు పెంచాలని, నేరుగా వీవోఏల బ్యాంక్ ఖాతాల్లోనే ప్రభుత్వం వేతనాలు జమచేయాలని కోరారు. వీవోఏల సంఘం జిల్లా నాయకురాలు షేక్ సుభానీ మాట్లాడుతూ లోకో యాప్స్ తీసుకువచ్చి డేటాను అప్‌లోడ్ చేయమంటున్నారని దానికి 5జీ ఫోన్ ఉంటే గాని సాధ్యం కాదన్నారు. పనిఒత్తిడి తగ్గించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. ధర్నా అనంతరం వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా సీహెచ్ నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా షేక్ సుభాని, 20 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

### యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్ ప్రతినిధి బీ వాసంతి తెలిపారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో ద్వితీయ సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు సుషుమ్న క్రియాయోగం ద్వారా వారి భవిష్యత్‌కు ఎంతవరకూ ఉపయోగపడుతుందో, యోగా ఎందుకు చేయాలి, దాని ద్వారా పొందే ప్రయోజనాలపై అవగాహన తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ శరీరం మొత్తం 72 వేల నాడులతో ప్రాణశక్తి నింపి దాని ద్వారా నాడులను చైతన్య పరిస్తే ఎంతో మానసిక ఆరోగ్యంగా ఉండగలమన్నారు. ముద్ర, ఓంకారం, భావంతో శ్వాస, నేత్రధ్యానం సుషుమ్న క్రియా యోగాలో ప్రధానమైనవన్నారు. ఆయా చర్యల ద్వారా శరీరం, మనస్సు, మెదడు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఆరోగ్యం దృఢంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

- డీవైఈవో రవీంద్రభారతి
- ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం
- విద్యాలయాల్లో గురువులకు సత్కారం



ఉంగుటూరు: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డీవైఈవో రవీంద్రభారతి, ప్రజాప్రతినిధులు



భీమడోలు: ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు



నిడమర్రు: జిల్లా అవార్డు గ్రహీత రమేష్‌ను సత్కరిస్తున్న జెడ్పీటీసీ, ఎంఈవోలు



గణపవరం: గురువులను సత్కరించిన ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఉంగుటూరు: నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని, అంకితభావంతో పనిచేసిన గురువులు ప్రజామన్ననలను అందుకుంటారని డీవైఈవో రవీంద్రభారతి అన్నారు. మండలంలో 12 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని అన్నారు. సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దారు వెంకటరమణ, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, ఎంఈవో– 2 శ్రీనివాసరావు, వైసీపీ నాయకుడు పుప్పాల గోపి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును అధ్యాపకులు శాలువా కప్పి సత్కరించారు. అధ్యాపకులను విద్యార్థులు సత్కరించారు. మానవత ఆధ్వర్యంలో కైకరం కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, అధ్యక్షుడు గంజి రవి, సీతాల సత్యనారాయణ, సత్యవతి కోనే సత్యనారాయణ పాల్గొన్నారు.

నారాయణపురం డిగ్రీ కళాశాలలో మంగళవారం గురు పూజోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు డా.కొండా రవిని, అధ్యాపకులను సత్కరించారు. కళా శాల ఇన్‌ఛార్జి రెడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

**విద్యకు అధిక ప్రాధాన్యత**

భీమడోలు: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు ఎంఆర్సీలో మంగళవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, వైసీపీ డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి పాల్గొన్నారు. మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు జి.శాంతకుమారి (వడ్డిగూడెం), కె.తులసి (పోలసానిపల్లి), కె.నాగేశ్వరరావు (పూళ్ల), ఎం.దుర్గాప్రసాదిని(అన్నేవారిగూడెం), కేవీ రాజ గోపాలకృష్ణ (ఆగడాలలంక), జిల్లా అవార్డు గ్రహీత ఎస్‌కే మస్తాన్, మండలంలో ఉపాధ్యాయులకు ఉత్తమ సేవలందించిన కొప్పిశెట్టి గోపిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందజేశారు. ఏలూరు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ డి.సాంబశివరావు, కమిటీ నిర్వాహకులు పాశం పాండురంగారావు, ఎం.శరీన్, బాలిన సత్యనారాయణ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, ఉపాధ్యాయ సంఘాల నేతలు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

**డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో**

భీమడోలులోని డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులు టీవీ ఉమామహేశ్వరరావు, పోలిశెట్టి సత్యేంద్ర, విజయసింహారావు, కొప్పిశెట్టి గోపి, యలమర్తి రవీంద్రకుమార్‌ను ఘనంగా సత్కరించారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరులో పాఠశాలలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, రిటైర్డ్ హెచ్‌ఎం బి.లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. భీమడోలులోని మాధురి కళాశాలలో కరస్పాండెంటెంట్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో రిటైర్డ్ టీచర్లు, అధ్యాపకులను యువతీ యువకులు సత్కరించారు. భీమడోలు రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ భవనంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు, మండల చైర్మన్ గుల్లా నూకరాజు, జిల్లా శాంతి రథాల అధ్యక్షుడు అప్పకరాంబాబు పాల్గొన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, పెద్దలు పాలేటి బ్రహ్మారావు, గుల్లా అప్పారావు పాల్గొన్నారు.

**విజ్ఞాన వారధి గురువు**

గణపవరం: విజ్ఞాన వారధి గురువే అని జెడ్పీటీసీ దేవవరపు సోమలక్ష్మి అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా కాశిపాడు నం–1 స్కూల్లో మండలస్థాయిలో గురుపూజోత్సవం ఎంఈవో గొర్రెల బాలయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న సీహెచ్ అగ్రహారం యూపీ స్కూల్ టీచర్ బొడ్డు రమేష్‌తోపాటు మండల స్థాయిలో ముగ్గురికి, కాంప్లెక్స్ స్థాయిలో ఆరుమంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఘనంగా సత్కరించారు. వీరిలో ఎల్ ప్రసాదరావు (ప్రీస్కూల్, జల్లికొమ్మర ), ఉమాదేవి (ఫౌండేషన్ ప్లస్ స్కూల్–1, కేశవరం), జి. దుర్గా ప్రసాద్ (ఫౌండేషన్ ప్లస్ స్కూల్–1. కోమర్రు)తోపాటు, ఆయా కాంప్లెక్స్ స్థాయిలో కర్రి అపర్ణ, ఎ. అంజనాదేవి, ఎల్ నాగలక్ష్మి, వి. విజయనిర్మల, డి. హేమలత, జె. అప్పారావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు ఎంఈవో అల్లూరి రామరాజు, వ్యాఖ్యాత సత్యనారాయణమూర్తి, కాశిపాడు స్కూల్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, టీవీఎస్ రంగనాయకులు, కాశిపాడు ఉపాధ్యాయులు, సర్పంచ్ కోట నాగశ్వరరావు, ఎంపీటీసీ జంపన పద్మావతి, వైసీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు సిల్వస్టర్ రాజులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**గురువులపై గురుతర బాధ్యత**

నిడమర్రు: గురువులపై గురుతర బాధ్యత ఉందని నిడమర్రు జెడ్పీటీసీ సభ్యుడు కోడే కాశీ, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి అన్నారు. మంగళవారం నిడమర్రు మండల ఉపాధ్యాయ సంఘాల జాక్టో ఆధ్వర్యంలో నిడమర్రు ఎంఆర్సీ భవనంలో గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. సభకు ఎంఈవో కె.రాంబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ, ఎంపీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆరుగురు ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. జాక్టో నాయకులు కె.మల్లేశ్వరరావు, మండల రామకృష్ణ, జయప్రకాష్ నారాయణ, ఛానమిల్లి హైస్కూలు హెచ్‌ఎం వై.శేషగిరిరావు పాల్గొన్నారు.

# సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి అత్యున్నత గౌరవం



దెందులూరు: ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, ఎంపీడీఓ లక్ష్మి



పెదపాడు: కో ఆపరేటివ్ సొసైటీలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకులు



దెందులూరు: నర్సింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రూపొందించిన చిత్రం

దెందులూరు: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి అత్యున్నత గౌరవం ఉందని ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత రాష్ట్రపతిగా ఎంపికైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం దేశంలో ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేలు అన్నారు. మంగళవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ప్రిన్సిపల్ నతానియేలు ఆధ్వర్యంలో గురుపూజోత్సవం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత అధ్యాపకులు సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఎంపీడీఓ కార్యాలయంలో**

ఎంపీడీఓ కార్యాలయంలో మండల విద్యాశాఖాధికారి ఎ.వీ.ఎన్.వీ. ప్రసాద్ అధ్యక్షతన గురుపూజోత్సవాన్ని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఆర్.రామకృష్ణ, బీవీ లక్ష్మి, పి.ప్రమీలా రాణి, వి.దేవి రాణి, ఎస్.శ్రీలక్ష్మి, ఎస్.ఆంజనేయులు, ఎ.భవాని, ఎం.వీ భద్ర, జి.భాస్కర్‌ను దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, డివిజనల్ పంచాయితీ ఆఫీసర్ ఏబీపీవీ లక్ష్మి, ఎంఈఓ ఏవీఎన్‌వీ ప్రసాద్ సత్కరించారు. జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బృహత్తర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ఎస్టీయూ జిల్లా నేత అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమ నిర్వాహకుడు ఏవీ ప్రసాదరాజు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 అన్నమ్మ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

దెందులూరు నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుబ్బిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న నర్సింగ్ విద్యార్థినులు గురుపూజోత్సవ వేడుకలు ప్రతిబింబించేలా పెద్ద చిత్రాన్ని కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. దెందులూరు సెంట్ మేరీస్ యూపీ పాఠశాలలో హెచ్‌ఎం హీనా మరియ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

**ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి**

పెదపాడు: ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, తెలిపారు. పెదపాడు కోఆపరేటివ్ సొసైటీలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సబ్బితి శేషారత్నం నర్సింహమూర్తి దంపతులను, మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అన్నపూర్ణ, ఏ శివకుమారి, శ్రీనివాసరావు, జయలక్ష్మి, జయప్రకాష్, ఖండవల్లి పురుషోత్తం సుబ్రహ్మణ్యం, ఆరవల్లి రవికుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ పద్మశ్రీ మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రుల వద్ద కంటే ఉపాధ్యాయుల వద్దే ఎక్కువ సమయం ఉంటారని వారిని సన్మార్గంలో నడిపించాలన్నారు. పిల్లలకు బంగారు భవిష్యత్ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేశారని తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాఠశాలల అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ కార్యదర్శి ఆళ్ల సతీష్ చౌదరి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, వైఎస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణ, విశ్రాంత ఉపాధ్యాయుడు కుకునూరి రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు పీ నీరజ, కే తనూజ, ఏ దీప్తి, ఎల్ రామచంద్రరావు ఈవీయువీ సత్యన్నారాయణ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ హృదయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అలరించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కొమ్మర ప్రీ స్కూల్లో సర్వేపల్లికి విగ్రహానికి పూలమాల వేస్తున్న చిన్నారులు



కొమ్మర ప్రీస్కూల్లో ఉట్టి కొట్టేందుకు పోటీ పడుతున్న చిన్నారులు

గణపవరం: జల్లికొమ్మర ప్రీహైస్కూల్లో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో స్కూలుకు పంపించారు. దీంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. గురుపూజోత్సవం సందర్భంగా పాఠశాల ప్రాగణంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి చిన్ని చిన్నారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుందర్‌కుమార్, ఉపాధ్యాయులు ప్రసాదరావు, శ్రీదేవి, సరస్వతి, పార్వతి, లీలాగోపాల్, ఐ.రమేష్, ఎంవీ రమేష్ తదితరులున్నారు.

## ఎన్నికల నిర్వహణపై ఉన్నతాధికారుల సమీక్ష



ఎన్నికల నిర్వహణపై సమీక్షిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఈఆర్వో సత్యనారాయణమూర్తి

దెందులూరు: నియోజకవర్గంలో ఓట్లు చేరిక, తొలగింపు, అభ్యంతరాలు, పోలింగ్ బూత్‌ల సామర్థ్యం నూతన పోలింగ్ బూత్‌ల ఆవశ్యకతపై మంగళవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఈఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణమూర్తి అధికారులతో సమీక్షించారు. మంగళవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలను, వినతులను నిబంధనలకు అనుగుణంగా నాలుగు మండలాల్లో ఎన్నికల అధికారులు బీఎల్ఓలు స్వీకరించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రభుత్వాధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ఆన్‌లైన్‌లో ఉందని, పార్టీలకు విధిగా అందజేస్తామని తెలిపారు. దెందులూరు తహసీల్దార్ నాంచారయ్య, పెదపాడు తహసీల్దార్ విజయ్ కుమార్, పెదవేగి తహసీల్దార్ నాగరాజు, ఏలూరు తహసీల్దార్ సూర్యనారాయణ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేఖర్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పెదపాడు: పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించనున్నట్లు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. మండలంలోని సత్యవోలు, ఎస్ కొత్తపల్లిలో నూతనంగా మంజూరైన పింఛన్లు, రేషన్ కార్డులు, ఓటీఎస్ పట్టాలు పంపిణీ చేసారు. ఈసందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఎవరికీ అవసరమున్నా మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లా డుతూ ప్రజలకు అవసరమైన పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రంభ ఉమామహేశ్వరి, చేపేని రంగారావు, ఉపసర్పంచ్ శ్రీను, వైకుంఠపు ధనంజయ్, సొంగల మహేశ్వరరావు, ఘంటా వెంకటేశ్వరరావు, కొట్నాన వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి డీవీ రమణ, వీఆర్వో అల్లు ప్రసాద్ పాల్గొన్నారు.

## ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత ధ్యేయం

పెదవేగి : ఉత్తమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా మానవతా సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ రీజియన్ అధ్యక్షురాలు అడుసుమల్లి నిర్మల అన్నారు. మంగళవారం పెదవేగి మండలం వంగూరులోని జేజే కరుణోదయ సంస్థ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో విశ్వమాత మదర్ థెరిస్సా వర్ధంతి, టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నిర్మల హాజరయ్యారు.జేజే కరుణోదయ సంస్థ నిర్వాహకులు హెన్రి డోమినిక్ సేవలు ఆదర్శప్రాయమని ఆమె అన్నారు. ఏలూరు పీఠాధిపతులు పొలిమేర జయరావు ఆదేశానుసారం సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానుయేల్ సహాయ సహకారాలతో పాఠశాలలో చదువుతున్న 120 మంది విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు నూతన వస్త్రాలను బహూకరించారు. ముందుగా మదర్ థెరిస్సా, సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. అబ్రహం మాస్టారు దంపతులు, మానవతా సంస్థ సెక్రటరీ అజయ్ బాబు పాల్గొన్నారు.

### కొబ్బరి కొనుగోలు కేంద్రాలను తెరవాలి

ఏలూరు (టూటౌన్): కొబ్బరి కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరచి కొబ్బరి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్ నందు ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షుడు బొల్లి రామకృష్ణ అధ్యక్షతన కొబ్బరి రైతుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 35 వేల ఎకరాల్లో కొబ్బరి తోటల విస్తీర్ణం ఉందని చెప్పారు. కొబ్బరి కాయలకు కనీస ధరలు రాక కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు గతేడాది వరకూ 100 కొబ్బరి కాయలకు రూ.1000 నుంచి రూ.1200 ఇచ్చేవారని, ప్రస్తుతం రూ.600 నుంచి రూ.700 మాత్రమే ఇస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులకు అనుమతులు ఇవ్వడంతో దేశీయ మార్కెట్‌లో కొబ్బరి ధర పడిపోయిందన్నారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాఫెడ్, ఆయిల్‌ఫెడ్‌లను వెంటనే రంగంలోకి దింపి కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలని కోరారు. జిల్లాలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలను సహకార రంగంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కొబ్బరి రైతులు పి.అచ్యుతరామయ్య, జి.రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.